ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
గురువారం 26 సెప్టెంబరు 2024



'సీఎంఆర్'పై నిర్లక్ష్యం



- గడువు పెంచుతారని మిల్లర్లు
- మిల్లర్లపై అధికారుల ఉదాసీనత
- మిగిలిన గడువు నాలుగు రోజులే
- రెండు సీజన్లలో రావాల్సిన లేవీ బియ్యం 1.50 లక్షల మెట్రిక్ టన్నులు పెండింగ్
- కస్టమ్ మిల్లింగ్ రైస్ పూర్తి చేయని మిల్లులపై చర్యలేవి?

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ విషయమై రైస్ మిల్లుల యజమానులపై పౌర సరఫరాల శాఖ, ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడం, ఆ తరువాత గడువు పెంచడం పరిపాటిగా మారింది. దీంతో జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ సేకరణలో తీవ్ర జాప్యం కనిపి స్తోంది. ప్రభుత్వం గడువు పెంచుతుందని మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తున్నట్లు వ్యక్తమవుతోంది. జిల్లాలోని అధికారులు కూడా మిల్లర్లపై కాస్తా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో సీఎంఆర్ సేకరణలో ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరించి జరిమానాల వరకు వెళ్లినా చర్యలు మాత్రం కనపించలేదు. జిల్లాలో 107 రైస్‌మిల్లులు ఉండగా ప్రధానంగా రా రైస్‌మిల్లులు 73, బాయిల్డ్ రైస్ మిల్లులు 34 ఉన్నాయి. ప్రధానంగా ఉన్న రా రైస్ మిల్లుల్లోనే నిర్లక్ష్యం కనిపిస్తుం దనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 2023-24 సంవత్సరానికి సంబంధించి వానాకాలం, రబీకి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ విధానంలో బియ్యం సేకరించే గడువు ఈ నెల 30తో ముగియనుంది. ప్రతీసారి గడువు ఉన్నా కొనసాగింపు సర్వసాధారణమేననే అభిప్రా యంలో మిల్లర్లు ఉన్నారు. రెండు సీజన్‌లకు సంబంధించి జిల్లాలో ఐకేపీ, సింగిల్ విండోలు, మార్కెట్ కమిటీలు, మెప్మాల ద్వారా జిల్లా లోని మిల్లులకు బియ్యం సరఫరా చేశారు. ప్రతి సీజన్‌లోనూ సీఎంఆర్ విషయంలో జాప్యం జరుగుతూనే ఉంది. జిల్లా అదనపు కలెక్టర్ అనేకమార్లు సీఎంఆర్ సేకరణపై సమావేశాలు నిర్వహించి ఆదేశాలు ఇస్తున్నా మిల్లర్లు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఆలస్యం ఎందుకు?

జిల్లాలో రెండు సీజన్లకు సంబంధించిన బియ్యం సేకరణ ఎందుకు ఆలస్యం జరుగుతుందనే అనే దానిపై అనేక విమర్శలు ఉన్నాయి. కొందరు మిల్లర్లు ధాన్యాన్ని ముందస్తుగానే సొంత వ్యాపారంలో అమ్ముకొని సీఎంఆర్‌లో జాప్యం చేయడం జరుగు తుందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మిల్లర్లకు క్వింటాల్ ధాన్యం ఇస్తే మిల్లర్లు మరాడించి 67 కిలోల బియ్యాన్ని లేవీ రూపంలో తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మిల్లర్లు గడువులోగా అందించిన దాఖలాలు లేవు.

జిల్లాలో 2023- 24 సంవత్సరానికి వానాకాలం, యాసంగికి సంబంధించి 3,09,026 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉండగా 1,50,202 మెట్రిక్ టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉంది. గత వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2,00,715 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు కేటాయించారు. దీని ద్వారా 1,34,861 మెట్రిక్ టన్నుల బియ్యం లేవీ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 92,916 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇచ్చారు. 42,867 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉంది. ఇందులో రా రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 1,40,429 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 94,087 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 61,074 మెట్రిక్ టన్నులు అందించారు. 33,619 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. బాయిల్డ్ రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 38286 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 26,034 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 25,810 మెట్రిక్ టన్నులు అందించారు. 481 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. రా రైస్ మిల్లుల ద్వారా పౌరసరఫరాల కార్పొరేషన్‌కు 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 14,740 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 6032 మెట్రిక్ టన్నులు అందించారు. 8766 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి మిల్లులకు 2,56,126 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అందించారు. వీటి ద్వారా 1,74,165 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ ద్వారా సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 67,455 మాత్రమే సేకరించారు. 1,07,335 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాల్సి ఉంది. ఇప్పటివరకు బాయిల్డ్ రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 7499 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 5099 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 5075 మెట్రిక్ టన్నులు అందించారు. 34 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. బాయిల్డ్ రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు (ఎఫ్ఆర్‌కే) 2,14,920 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 1,46,145 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 63,379 మెట్రిక్ టన్నులు అందించారు. 57,380 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. రా రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 33,520 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 22,793 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా ఇప్పటి వరకు బియ్యాన్ని అందించలేదు.

డీఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలు

జిల్లాలో 59 మంది మిల్లర్లు డీఫాల్ట్‌లో కొనసాగుతున్నాయి. 2000-2001 నుంచి 2022-23 వరకు 59 మిల్లులు డిఫాల్ట్‌గా కొనసాగాయి. వీరి ద్వారా జరిమానాలు విధించినా బకాయిలుగా మిగిలిపోయాయి. జిల్లాలో రూ.55.68 కోట్ల వరకు వసూలు చేయాల్సి ఉంది. 2021-22 వానాకాలానికి సంబంధించి 36 మిల్లులు, రబీలో 15 మిల్లులు, 2022 - 23లో ఖరీఫ్‌కు సంబంధించి 8 మిల్లుల నుంచి జరిమానా రూపంలో బియ్యాన్ని సేకరించాల్సి ఉంది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం డిఫాల్టర్లపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. వచ్చే రెండు సీజన్‌లకు సంబంధించి డిఫాల్ట్ అయిన మిల్లర్లు సీఎంఆర్‌ను అప్పగించి పౌర సంబంధాల శాఖ నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకుంటేనే కొత్త ధాన్యం కేటాయించాలని భావిస్తున్నారు. ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి చేయనున్నారు. గతంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలిన మిల్లర్లపై, 6ఏ, ఈసీ యాక్ట్ పెండింగ్‌లు ఉన్నవారిపై ధాన్యం కేటాయించవద్దని భావిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, చైర్ పర్సన్, నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25: సిరిసిల్ల పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సావాల నిర్వహణపై బుధవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో రమేష్ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్, విద్యుత్, పోలీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, దేవాదాయ శాఖల అధికారుల పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు, స్వామి రథయాత్ర నిర్వహణపై చర్చించారు. అనంతరం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ, వివరాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆర్డీవో, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కమిషనర్ మిర్జా ఫసహత్ అలీ బేగ్, విద్యుత్, పోలీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, దేవాదాయ శాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులు ఆవిష్కరించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్య నారాయణ, సంగీతం శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, వికాస తరంగిణి, సత్యసాయిసేవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండో రోజు ఇంటర్వ్యూలు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 25 : మైనార్టీ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు బుధవారం కొనసాగాయి. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని మైనార్టీ విద్యాసంస్థలో జూనియర్ లెక్చరర్స్, ఇంగ్లీష్, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ మ్యాథ్స్, టీజీటీ సైన్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఒక్కో పోస్టుకు మెరిట్ ప్రకారం ఆరుగురు అభ్యర్థులను పిలిచి ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇంటర్వ్యూల్లో ఆర్ఎల్‌సీ రాజేందర్, డిస్ట్రిక్ ఇన్‌చార్జి మైనార్టీ అధికారి రాధాబాయి, ఓఎస్‌డీ సర్వర్‌మియా, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఫాతిమా పాల్గొన్నారు.

పిల్లల వివరాలను యాప్‌లో నమోదు చేయాలి


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 25: అంగన్‌వాడీల పరిధిలోని పిల్లల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక అదనపు అనుబంధ పోషకాహారం సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ టీఎస్ ప్రత్యేక యాప్ ద్వారా పిల్లల పెరుగుదలను నమోదు చేయాలన్నారు. ఎదుగుదలలో పోషణలోపం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం వంటి అంశాలను గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు నమోదు చేసిన తర్వాత సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. దీని ద్వారా అక్కడ వైద్యులు మూడు రోజుల్లో ఆ పిల్లలకు సంబంధించిన ఆరోగ్యపరీక్షలు నిర్వహి స్తారన్నారు. పోషణలోపం ఉన్న పిల్లలందరికీ అవసరమైన మందులతోపాటు పోషణ గురించి కౌన్సెలింగ్ నిర్వహించ నున్నట్లు చెప్పారు. జిల్లాలో పోషణలోపాన్ని అరికట్టడానికి వైద్యశాఖ సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు. స్థానిక ఆహారపు అలవాట్లను పాటించాలని, అన్ని రకాల కూరగాయలతోపాటు పళ్లను తీసుకునే విధంగా సూచించాల అన్నారు. ఆకుకూరలు పుదీనా, మెంతి, తోటకూర, పాలకూర, బచ్చలికూర, గోంగూర వంటివి తప్పనిసరిగా ప్రతీ రోజు ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎనీమియా లోపం, నష్టాల గురించి వివరించాలని, ఆహార పదార్థాలు, పాలు, కోడిగుడ్లు, సంపూర్ణ ఆహారమని అన్నారు. వాటిని కూడా తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత్‌రావు, ఉపవైద్యాధికారులు డాక్టర్ రాజుగోపాల్, డాక్టర్ రజిత, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమా, రాష్ట్రీయ బాలస్వాస్థ్యయోజన ప్రోగ్రాం అధికారి మహిమ, సీడీపీవోలు ఉమరాణి, సౌందర్య, ఏసీ డీసీ సుచరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, సెప్టెంబరు 25 : గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, ఇన్‌చార్జి అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, ఆయా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో వేములవాడ డివిజన్ స్థాయి అధికారులతో మర్రిపల్లి రైతు వేదికలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోందన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. ఇళ్ల నిర్మాణ విషయంలో జాప్యం లేకుండా అనుమతులను ఇవ్వాలన్నారు. అనుమతుల మంజూరు విషయంలో ఇబ్బందులు వస్తే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. బతుకమ్మ దసరా పండుగ ఉత్సవాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆయా మండలాల ప్రత్యేక అధికారులతో గ్రామ కార్యదర్శులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, డీఎల్పీవో గీత పాల్గొన్నారు.

చందుర్తి: వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో సెస్ చైర్మన్ చిక్కల రామారావుతో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు రూ.1731 కోట్లు నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంలోని తొమ్మిది ప్రధాన ప్రాజెక్టుల్లో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును చేర్చి, బడ్జెట్లో 325 కోట్లు కేటాయించారన్నారు. మల్యాలలో బ్యాంకు ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామన్నారు. మల్యాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు చింతపంటి రామస్వామి, దొంగరి భూమయ్య, ధర్మపురి శ్రీనివాస్, మల్లారపు రాజయ్య, బొజ్జ మల్లేశం, పులి సత్తయ్య శంకర్, ప్రసాద్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములుకావాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25 : యువత స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములుకావాలని మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ బేగ్ అలీ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణ శివారులోని మైదానంలో స్వచ్ఛత హీ సేవలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టీం, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ టీంలుగా విభజించి రెండు జట్లు తలపడగా మున్సిపల్ కమిషనర్ టీం విజేతగా నిలిచింది. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ స్పోర్ట్స్‌లో భాగంగా టోర్నీ నిర్వహించినట్లు చెప్పారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నరసింహస్వామి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రఘు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 25: చీడపీడలను తొలిదశలోనే గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి సూచించారు. మండలంలోని పొత్తూరులో బుధవారం వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరిలో ఆకు ఎండుతెగలు, అగ్గితెగలు వచ్చే అవకాశం ఉందన్నారు. అగ్గితెగలు నివారణకు తుబకనజోల్, ట్రై ఫ్లాక్సిస్ట్రోబిన్‌ను పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో లలిత, రైతులు రాజేశం, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి


బ్లాంకెట్స్ అందజేస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ, సెప్టెంబర్ 25 : విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని, క్రమశిక్షణ, పట్టుదల ఓపికతో కష్టపడినప్పుడే విజయాలు సాధిస్తారని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఉన్నత ఆశయాలతో చదువులో ముందంజలో ఉన్నప్పుడే సమాజంలో గొప్ప పౌరులుగా గుర్తింపు పొందే అవకాశం ఉందన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, సామర్థ్యం, పాజిటివ్ ఆలోచనలతో జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఉన్నతమైన లక్ష్యలను ఏర్పరచుకుని చదివి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.జిల్లాలో షీ టీమ్ సమర్థవంతంగా మహిళల రక్షణనే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. సోషల్ మీడియా ద్వారా ఎవరైనా ఇబ్బందులకు గురి చేసినా, ఈవ్ టీజింగ్ చేసినా, వెంటబడి వేధించినా జిల్లా షీ టీమ్ నంబరు 8712656425 లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బ్లాంకెట్స్ అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరప్రసాద్ పాల్గొన్నారు.

చందుర్తి : గ్రామీణ ప్రాంతంలో యువత సామాజిక సేవలు అభినందనీయమని ఏఎస్పీ శేషాద్రి రెడ్డి అన్నారు. చందుర్తి మండలం మల్యాలలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కోల్పోయిన బంటు రవికి మల్యాల దుబాయ్ అభివృద్ధి కమిటీ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. మల్యాల దుబాయ్ గ్రూప్ కమిటీ సభ్యుల సామాజిక సేవలను కొనియాడారు. సీఐ వెంకటేశ్వర్లు, మల్యాల దుబాయ్ అభివృద్ధి కమిటీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

నీటిని క్లోరినేషన్ చేయాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 25: పల్లెల్లో ప్రజలకు అందించే నీటిని విధిగా క్లోరినేషన్ చేయాలని మిషన్ భగీరథ ఈఈ జానకి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని నీటి సహాయకులకు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ జానకి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. మంచినీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీవో రాజు, ఏఈలు సంతోష్, అనిల్, అభిషేక్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులను ప్రారం భించారు. తాగునీటి నాణ్యత ఎలా శుద్ధి చేయాలనే అ ంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, నీటి పారుదల శాఖ ఏఈ కల్పన ఉన్నారు.

నేడు కేటీఆర్ రాక

బోయినపల్లి, సెప్టెంబరు 25: బోయినపల్లి మండలంలోని కొదురుపాకలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కేటీఆర్ గురువారం రానున్నారు. కేటీఆర్ అమ్మమ్మ, తాతయ్య స్మారకార్థం నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభించనున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరు కానున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసరావు తెలిపారు.

వసతి గృహంలో సమస్యల పరిష్కారం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 25: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి బీసీ బాలుర వసతి గృహంలో సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. 'సంక్షేమంలో సమస్యలపై నిర్లక్ష్యం' అనే శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన' కథనానికి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజమనోహర్‌రావు బుధవారం స్పందించారు. పరిసరాలను పరిశుభ్రం చేయడంతోపాటు దోమ తెరలు, శుద్ధజలం అందించాలని ఇన్‌చార్జి వార్డెన్ రాజశేఖర్‌ను ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను శుభ్రం చేసి దోమ తెరలను బిగించారు. విద్యార్థులకు శుద్ధ జలాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. సమస్యలను పరిష్కరించడంపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



భక్తుల మనోభావాలను గౌరవించాలి


చిరువ్యాపారులతో మాట్లాడుతున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల మనోభా వాలను గౌరవించాలని ఈవో వినోద్‌రెడ్డి సూచించారు. వేములవాడ పట్టణంలోని ఆలయ వసతి గదులు, పార్కింగ్ స్థలాల సమీపంలోని ఫుట్‌పాత్, డ్రైనేజీలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ వసతి గదులు, పార్కింగ్ స్థలాల సమీపంలోని ఫుట్‌పాత్, డ్రైనేజీలను ఆక్రమించిన చిరువ్యాపారులు వెంటనే తొలగించాలని ఆదేశించారు. రాజన్న ఆలయానికి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతి గదులకు, పార్కింగ్ స్థలానికి వెళ్లేందుకు పట్టణంలో ఏర్పాటు చేసిన 40 ఫీట్ల రోడ్డును పూర్తిగా ఆక్రమించి 15 ఫీట్ల వరకు కుదించారని, దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీని శుభ్రం చేసేందుకు వస్తున్న సమయంలో చిరువ్యాపారుఉల సహకరించడం లేదని, వర్షం పడిన సమయంలో డ్రైనేజీలు పొంగి వ్యర్థాలు రోడ్డుపై పారుతున్నాయని అన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు అందులో నుంచి రావాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. దీంతో కొందరు చిరువ్యాపారులు ఆక్రమించిన స్థలాన్ని ఖాళీ చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. మరికొంత మంది జీవనోపాధి కోసం చిరు వ్యాపారం చేసుకుంటున్నామని ఈవో దృష్టికి తీసుకురావడంతో రాజన్న ఆలయానికి సంబంధించి లీజ్ ఇచ్చే దుకాణాలు వేలం వేసే సమయంలో సమాచారం అందిస్తామన్నారు. దీంతోతో చిరువ్యాపారులు ఫుట్‌పాత్, డ్రైనేజీని ఆక్రమించిన వారు వెంటనే తొలగించారు. ఈఈ రాజేష్, డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్, విజయ్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పర్యటన

● వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

గంగాధర, సెప్టెంబరు 25: వరి గొలక దశలో ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సిఫారసుతో మందులు పిచికారి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. బుధవారం గంగాధర మండలం నారాయణపూర్, కురిక్యాల, గట్టుబూత్కుర్ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, డీఏవో, ఏడీఏలు వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో ఎక్కువగా బ్యాక్టీరియా, ఎండు తెగులు, దోమపోటు, కంకినల్లి, పాము పొడ తెగులు, సన్న రకం వరికి ఆకునల్లి, కంకినల్లి సోకుతున్నట్లు గుర్తించి రైతులకు తగిన సహాలు, సూచనలు అందించారు. పూత దశలో ఉన్న వరికి కాపర్ సంబంధిత మందులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు గోపీచంద్, వెంకటస్వామి, వంశీధర్, రమ్య పాల్గొన్నారు.


వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టు

శంకరపట్నం, సెప్టెంబరు 25: శంకరపట్నం మండలం జాతీయ రహదారి నుంచి మొలంగూర్ గ్రామంలోకి వెళ్లే దారిలో కావేరి సీడ్ ప్లాంట్ సమీపంలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు ప్రమా దకరంగా ఉంది. ఆ చెట్టు విరిగి పడితే రోడ్డుపై వెళ్లే ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రమాదం సంభవించక ముందే చెట్టును తొలగించా లని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి

గంగాధర, సెప్టెంబరు25: దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తముల తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ సీనియారిటీ గల ఎస్జీటీలకు గత జీవోలను సవరించి బీఈడీ అర్హత ఉన్న వారికి పదోన్నతి కల్పించాలన్నారు. సంవత్సరకాలంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, మెడికల్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కిషన్‌రెడ్డి, పెరుక నర్సయ్య, జిల్లా నాయకులు సముద్రాల అంజయ్య, గంగాధర మండల నాయకులు పాల్గొన్నారు.

వెంటాడిన విషాదం

- అనారోగ్యంతో కుటుంబ పెద్ద మృతి
- మృతదేహాన్ని ఇంటికి తీసుకురానివ్వని ఇంటి ఓనర్
- గ్రామ శివారులోనే మృతదేహం
- గ్రామస్థుల సాయంతో అంత్యక్రియలు పూర్తి



మృతుడి కూతుళ్లకు ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోట లక్ష్మణ్ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 25 : ఇంటి పెద్దాయన కష్టం చేస్తే తప్ప కడుపు నిండని ఆ కుటుంబంపై విధి పగబట్టింది. హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్(55), ప్రేమలత దంపతులు గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వివాహం చేశారు. మంగళవారం లక్ష్మణ్ అకస్మాతుగా కిందపడిపోయాడు. గమనించిన భార్య గ్రామస్థుల సహకారంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో ఇంటి యజమాని మృతదేహాన్ని తీసుక రావద్దంటూ ఆదేశించడంతో గ్రామ శివారులో మృతదేహాన్ని ఉంచారు. అంత్యక్రియలు చేసేందుకు కూడా చేతిలో డబ్బులు లేక భార్య ప్రేమలత దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్థులందరూ ముందుకు వచ్చి తలాకొంత పోగుచేసి రూ. 80వేల ఆర్థికసాయం అందించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అంత్యక్రియల కోసం కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 25: జమ్మికుంట వ్యవ సాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తిధర రూ.7,600 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 30 మంది రైతులు 149 క్వింటాళ్ల విడి పత్తి, 11 మంది రైతులు 154క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీకి ఎంపిక

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25 : మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ క్రికెట్ పోటీకి అండర్ 19 విభాగంలో యువకుడు ఎంపికయ్యాడు. మండలంలోని ఎదులపూర్ గ్రామానికి చెందిన బోల్తా సాహితికుమార్, హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాడు. క్రికెట్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రతిభను గుర్తించిన ఎంఎస్‌సీ క్రికెట్ అకాడమీ హైదరాబాద్ వారు అండర్ 19విభాగంలో అక్టోబర్ 20 నుంచి 29వరకు శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీకి ఎంపిక చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, సెప్టెంబరు 25 : మండలంలోని చిప్పలపల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆవునూర్ ఎగువ మానేరు వాగు నుంచి ఐదు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, సెప్టెంబరు 25 : మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామం వద్ద మోయతుమ్మెద వాగులో బుధవారం చుట్టి ఉన్న కవర్‌లో ఓ మృతదేహం కొట్టుకుపోతుండగా జాలర్లు గుర్తించి బయటికి తీశారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్స రాల వరకు ఉంటుంది. మృతదేహం గుర్తుపట్టని విధంగా ఉండటంతో అక్కడే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వడ్లూరి అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- అనుమతులు లేకుండా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు



జంగపల్లిలో అక్రమంగా నిలువ ఉంచిన కలప

గన్నేరువరం, సెప్టెంబరు 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెట్లను నరికివేస్తూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కలప వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గ్రామాలలో రైతుల వద్ద చెట్లను కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేసి లారీలలో లోడ్ చేసి తరలిస్తున్నారు.

జంగపల్లి గ్రామంలో స్మశాన వాటిక పక్కన పెద్ద ఎత్తున కలప నిల్వ చేశారు. ఇక్కడి నుంచి లారీలలో తరలిం చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీసులు కలప అక్రమ రవాణాను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవైపు అధికారులు హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటుతుంటే కలప వ్యాపారులు అక్రమంగా చెట్లను నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా కలప అక్రమ రవాణాను నివారించాలని కోరుతున్నారు.

చిన్న దేవాలయాల ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

● టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



ఆలయ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో పెద్ద దేవాలయలైన వేములవాడ, యాదాద్రి, భద్రాచలం ఆలయాల మాదిరిగానే చిన్న దేవాలయాలైన కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాల ఉద్యోగులకు సైతం పీఆర్సీ అమలు చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఆలయాల ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర జేఏసీ చైర్మన్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ 261 జీవోను సవరించాలని, ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని అన్నారు. పని గంటలతో నిమిత్తం లేకుండా అవసరానికి మించి ఉద్యోగులు పని చేశారని గుర్తు చేశారు. ఆలయాల్లో భక్తుల సంఖ్య ఎక్కువ ఉన్నందున క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో దేవాలయ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. క్యాడర్ స్ట్రెంత్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించి అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీలు చేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. స్పౌస్‌లో కూడా ఇష్టారీతిన బదిలీలు చేశారని విమర్శించారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలకు పనిభారం అధికంగా ఉందని, హాస్టల్ వెల్ఫేర్, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా పారిశుధ్య కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు.వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, కొమురవెల్లి, కొండగట్టు ఆలయాలకు చెందిన సుమారు 200 మంది ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ కార్యవర్గం

● చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు ఎన్నిక



రాష్ట్ర చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్రదేవాదాయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా వేములవాడ రాజన్న ఆలయ ఏఈవో గజవెల్లి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. డిప్యూటీ చైర్మన్‌లుగా ఉపాధ్యాయుల చంద్రశేఖర్, బుద్ది శ్రీనివాస్, సుదర్శన్, గౌరవ సలహాదారులుగా దయాకర్, భాస్కర్, హరికిషన్, కృష్ణ, నమిలికొండ ఉమేశ్‌శర్మ, వరి నర్సయ్య, శ్రీరాములు, వెంకటాచార్యులు, కపీంద్రా చారి, మదన్‌కుమార్, వైస్ చైర్మన్‌లుగా మల్లికార్జున్, నిరంజన్, పీచర రంగారావు, సువర్ణరా ధాకిషన్, శ్రావణ్‌కుమార్, స్వామి, సునీల్‌కుమార్, నవీన్‌శర్మ, ఎడ్ల శిసాయి, కార్యదర్శులు గా గంగా శ్రీనివాస్, కిరణ్‌కుమార్ కోశాధికారిగా సురేంద్రాచార్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శ్రీధర్‌శర్మ, గోలి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు గా కట్కూరి వెంకటయ్య, మహేష్, మాధవాచార్యులు, క్రీడల కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నరసింహుని ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

● ఆదాయం రూ 47.70 లక్షలు

ధర్మపురి, సెప్టెంబరు 25 : ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా 47,70,995 రూపాయల ఆదాయం లభించింది. జూన్ 12నుంచి సెప్టెంబరు 25వరకు గల 105 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 50 గ్రాముల మిశ్ర మ బంగారం, నాలుగు కిలోల 700 గ్రాముల మి శ్రమ వెండి, 90 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆర్య వైశ్య నిత్యాన్న సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, యూబీఐ మేనేజర్ ఆశిష్ పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం వరద నీరు రావడం కొనసాగింది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 33,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 33,238 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, రెండు వరద గేట్లు ఎత్తడం ద్వారా 6,248 క్యూసెక్కుల నీరు దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా దిగువకు 1,200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా మధ్యమానేరు రిజర్వాయర్‌కు నీటిని వదులుతున్నారు.

30న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సీనియర్ బాలురు, బాలికలకు ఎంపిక పోటీలుంటాయన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9నుంచి రంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో 30న ఉదయం 10గంటలకు అసోసియేషన్ కార్యదర్శి ఎస్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9441 92807, 8978995730, 9550942180 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25 : ఎస్‌యూ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజుమునన అక్టోబరు 5లోగా చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబరు 9లోగా చెల్లించాలన్నారు. పరీక్షలను అక్టోబరులో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

జీవో 25 నిబంధనలు మార్చాలి

గంభీరావుపేట, సెప్టెంబరు 25 : రేషనలైజేషన్ జీవో 25ను నిబంధనలు మార్చాలని, అశాస్త్రీయమైన జీవోను అమలు చేయాలని కలెక్టర్లను పాఠశాల విద్యాసంచాలకులు ఆదేశించడాన్ని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అదే విధంగా 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబంధమైన విషయమన్నారు. ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ పాటించిన నిబంధనలను కూడా అమలు చేయక పోవడం పట్ల మహేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 317లో నష్టపోయిన వారికి సొంత జిల్లాలకు పంపాలని పెండింగ్ బిల్లులు డీఏలు మంజూరు చేయాలని పీఆర్సీ ప్రకటించి అమల చేయాలన్నారు. రాష్ట్ర ఈసీ మెంబర్ ఉమా బాలచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రామానాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోట్యాగిరి బాల్‌రాజు, కార్యదర్శి కరికె ప్రకాష్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

గవర్నర్ అవార్డుకు ఎంపికైన ఖని విద్యార్థులు



తృతీయ సోపాన్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 25: గోదావరిఖనిలో ఇటీవల జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ శిక్షణ శిబిరంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి గవర్నర్ అవార్డుకు అర్హత సాధించారు. హర్షవర్ధన్, భానుప్రసాద్, మణిదీక్షిత్, సలీంపాషా, సాయికృష్ణ, కౌశిక్, మారుతి ఎంపికయ్యారు. తృతీ య సోపాన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యా యులు జింక మల్లేష్, స్కౌట్ మాస్టర్ నీలిమ, ఉపాధ్యాయులు రమ, ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్, అరుంధత, మనోహర్ శాస్త్రి అభినందించారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

మరొకరికి 10 ఏళ్లు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 25 : ఓ వ్యక్తి హత్యకు కారణమైన ఇద్దరిలో ఒకరికి జీవిత ఖైదు రూ.2500 జరిమానా, మరొకరికి 10 సంవత్సరాల జైలు శిక్ష రూ.2500 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం ముస్తాబాద్‌కు చెందిన పండుగ రాజం తండ్రి రాములుకు పండుగ మరియమ్మకి ఆస్తుల పంపకాల విషయంలో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో పండుగ రాజంను 1 సెప్టెంబరు 2020న పండుగ మరియమ్మ ఆమె కుమారుడు పండుగ మల్లేశం గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘనపై అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేశారు. పండుగ మరియమ్మ, మల్లేశంను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టులో 15మంది సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించారు. కేసు పూర్వాప రాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పండుగ మరియమ్మకి పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.2500 జరిమానా, పండుగ మల్లేశంకు జీవిత ఖైదుతోపాటు రూ.2500 జరిమానా విధించారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● రికార్డుల్లో మరో వ్యక్తి పేరిట సొంత పట్టా భూమి

గొల్లపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని గుంజపడుగు గ్రామంలో తన సొంత పట్టా భూమి గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరిట రికార్డుల్లోకి ఎక్కడంతో ఓ వృద్ధుడు తీవ్ర మనస్తాపం చెంది సదరు నకిలీ పట్టాదారు ఇంటి ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చుక్క లింగయ్య (78)కు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 74లో 0-14 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా లింగయ్య భూమి సాంకేతిక కారణాల వల్ల గ్రామానికి చెందిన నవ్య రమేష్ అనే వ్యక్తి పేరిట రికార్డుల్లో తప్పుగా నమోదైంది. దీనిపై లింగయ్య రెవెన్యూ కార్యాలయం చుట్టూ, రమేష్ ఇంటి చుట్టు రెండేళ్లుగా తిరుగుతున్నాడు. అయినప్పటికి అధికారులు పట్టించుకోలేదు. అసలు ఆ సర్వే నంబరులో రమేష్‌కు ఎలాంటి భూమి లేకున్నా తన భూమి అన్నట్లు వ్యవహరిస్తూ తీవ్రమానసిక క్షోభకు గురిచేస్తున్నాడని బాధిత కుటుంబసభ్యులు కన్నీళ్లపర్యంతమయ్యారు. ఈ సంవత్సరం మార్చి నెలలో ఎట్టకేలకు పట్టా చేస్తానని రమేష్ చెప్పడంతో ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే, మళ్లీ పట్టా చేయకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లింగయ్య పురుగుల మందు డబ్బాతో రమేష్ ఇంటికి వెళ్లి ఇంటి ముందర పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులను కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాగి వైరు చోరీ

సుల్తానాబాద్, సెప్టెంబరు 25 : సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో దొంగతనం జరిగింది. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. కరీంనగర్ వైపు రాజీవ్ రహదారిని ఆనుకుని శాస్త్రినగర్ ప్రాంతంలో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాత్రి దొంగలు ముఖాలకు మాస్కులు ధరించి వచ్చి కేంద్రంలోని కిటికీల గుండా లోనికి ప్రవేశించారు. అందులో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్‌చేసి దొంగతనానికి పాల్పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన మూడున్నర క్వింటాళ్ల రాగి వైరును ఎత్తుకెళ్లారు. దీని విలువ దాదాపు నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీస్ అధికారులు బుధవారం సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇతర ఆధారాల కోసం అన్వేషించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● బైక్ చోరీ

ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో చోటు చేసుకుంది. భైరోగని రవీందర్‌గౌడ్ అనే వ్యక్తి తన ఇంటి ఎదుట వాహనం నిలిపి ఉంచగా బుధవారం తెల్లవారి లేచి చూసేసరికి వాహనం కనిపించకుండాపోయింది. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ దొంగ బైక్‌ను ఎత్తుకెళుతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

వేములవాడ, సెప్టెంబర్ 25 : యాభై వేల రూపాయల నగదు దొంగిలించిన సంఘటనలో ఒకరికి 18 నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం మీడియాకు వివరించారు. గతేడాది ఆగస్టు 15వ తేదీన వేములవాడలోని మోత్కుపల్లి ఎల్లయ్య అనే వ్యక్తి షాప్‌లోని క్యాష్ కౌంటర్ నుంచి ఆదిలాబాద్ జిల్లా దండేపల్లి మండలం లక్ష్మీకాంతపురం గ్రామానికి చెందిన కాశెట్టి వెంకటేష్ 50 వేల రూపాయలు దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. విచారణ అధికారి ఎస్ఐ అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి కాశెట్టి వెంకటేష్‌కు 18 నెలల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటుతో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

శంకరపట్నం, సెప్టెంబరు 25 : శంకరపట్నం మండలం అర్కండ్ల శివారులో పిడుగు ప్రభావంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. గ్రామస్థుల సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో మెరుపులతో పెద్ద శబ్ధంతో పిడుగుపడి ట్రాన్స్‌ఫార్మర్ పేలినట్లు తెలిపారు.

జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు

జమ్మికుంట, సెప్టెంబరు 25 : జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు పెట్రేగి పోతున్నారు. రాత్రి వేళల్లో ఆరుబయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీ చేస్తున్నారు. పగలు సీసీ కెమరాలు లేని ప్రాంతాలను గుర్తిస్తూ రాత్రి వేళల్లో పెట్రోల్ చోరీకి పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒకే రోజు రాత్రి ఇరువై ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్‌ను తీశారు. సుమారు 50లీటర్ల వరకు పెట్రోల్ ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. పోలీస్‌లు రాత్రి వేళల్లో గస్తీ పెంచి, పెట్రోల్ చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గంజాయి అమ్మిన వ్యక్తి అరెస్ట్

● 350 గ్రాములు స్వాధీనం



అరెస్ట్ చూపుతున్న సీఐ నిరంజన్ రెడ్డి

మెట్‌పల్లి, సెప్టెంబరు 25 : దారి దొపిడీ కేసులో నిందితులకు గంజాయి అమ్మిన వ్యక్తిని బుధవారం పోలీస్‌లు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 350 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించాలరు. ఈనెల 21న ఇబ్రహీంపట్నం మండలంలోని బండలింగపూర్ క్రాసింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులను రెండు రోజుల క్రితం అరెస్ట్ చేసి విచారించారు. వైఎస్ఆర్ కాలనీకి చెందిన చందు వారికి గంజాయి అమ్మినట్టుగా తెలిపారు. దీంతో మెట్‌పల్లి డీఎస్పీ ఆదేశాలు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం చందు తన ఇంటివద్ద ఉన్నాడని పక్కా సమాచారం మేరకు చందు ఇంటి వద్దకు వెళ్లి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అతడిని విచారించగా గంజాయి అమ్మినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిచింనట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌కుమార్, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, రాజును అధికారులు అభినందించారు.

పోలీసుల జోక్యంతో ముగిసిన యువకుడి అంత్యక్రియలు



జగ్గసాగర్‌లోని సమస్యను తెలుసుకుంటున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అనే యువకుడి అంత్యక్రియలు పోలీసుల జోక్యంతో బుధవారం నిర్వహించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంతల దంపతుల కుమారుడైన ఏనుగు ప్రభాస్ మనస్తాపానికి గురై ఈనెల 8న ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈనెల 24న ప్రభాస్ మృతి చెందాడు. ప్రభాస్ ఆత్మహత్యకు తల్లె కారణమని ఆమెపై గ్రామంలోని కులస్థులు దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యువకుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తండ్రి ఏనుగు ప్రతాప్‌పై చేసి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించేదిలేదని కుటుంబ సభ్యులు, కులస్థులు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు అక్కడి చేరుకుని సమస్యను తెలుసుకున్నారు. తల్లి పేరు మీద ఉన్న ఆస్తి భర్త ప్రతాప్ పేరు రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేస్తామని పేర్కొన్నారు. పోలీసులు కలగజేసుకుని అంత్యక్రియలు జరిగిన తరువాత కుటుంబస భ్యులు, బంధువులు, కులస్థుల కలిసి సానుకూలంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించుకోవడానికి ఎలాంటి గొడవలు జరగకుండా రక్షణ కల్పిస్తామన్నారు. దీంతో వారు శాంతించి ఆ యువకుడి మృతదేహనికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆలయ కమాన్ నిర్మాణానికి భూమిపూజ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 25: మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయ కమాన్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పెద్దలింగాపూర్ స మీపంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మాజీ సర్పంచులు పల్లె నర్సింహ్మారెడ్డి, గొడిశెల జితేందర్‌గౌడ్, నీలం అంజయ్యమాజీ ఎంపీటీసీ గొట్టి పర్తి పర్శరాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మహా గర్జనను విజయవంతం చేయాలి

గంభీరావుపేట, సెప్టెంబరు 25 : ఈ నెల 27న ఇందిరా పార్క్ వద్ద జరిగే హలో విద్యార్థి చలో విద్యార్థి మహా గర్జనను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. గంభీరావుపేటలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మహాగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

108లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

వీర్నపల్లి, సెప్టెంబరు 25: గిరిజన మహిళకు 108లో సిబ్బంది పురుడు పోశారు. తల్లితోపాటు పుట్టిన ఆడబిడ్డ క్షేమంగా ఉన్నారు. వీర్నపల్లి మండలం బంజేరు గ్రామానికి చెందిన భూక్య శిల్పకు మంగళవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది పురుడు పోశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ మదన్, పైలెట్ రాజశేఖర్ తెలిపారు. .

ఇల్లంతకుంట : మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన పోతరాజు అనిత అనే గర్భిణికి 108 సిబ్బంది పురుడుపోశారు. అనిత బుధవారం పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు సిబ్బందికి సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికమవడంతో సిబ్బంది పురుడు పోయగా ఆడశిశువుకు జన్మించింది, తల్లీబిడ్డలు ఇద్దరు క్షేమంగా ఉన్నారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ శ్రీకాంత్, పైలట్ మనోజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముష్టిపల్లి రేషన్ దుకాణాన్ని స్థానికులకు కేటాయించాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 25 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని ముష్టిపల్లి గ్రామంలోని రేషన్ షాపును స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు కేటాయించాలని 10వ వార్డు కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌తోపాలు అర్జీలను ముష్టిపల్లి గ్రామానికి చెందిన వారితో కలిసి సమస్యలను విన్నవించి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ ముష్టిపల్లిలో ఉన్న రేషన్ షాపు నెంబరు 3908046ను కేటాయించేందుకు అధికారులు పరీక్షలను నిర్వహించగా గ్రామానికి చెందిన నిరుద్యోగులైన గుగ్గిళ్ల మహేష్, మనోజ్ ఇంట ర్వ్యూలకు హాజరైన వీరికి కాకుండా స్థానికేతరులకు దుకాణాన్ని కేటాయించారన్నారు.

కోనరావుపేట విద్యాధికారిగా మురళి నాయక్

కోనరావుపేట, సెప్టెంబరు 25: కోనరావుపేట మండల విద్యాధికారిగా మురళి నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కోనరావుపేట మండల విద్యాధికారిగా పని చేసిన దూస రఘుపతి బదిలీపై వెళ్లగా ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మురళి నాయక్‌ను ఎంఈవో నియామకమయ్యారు. ఉపాధ్యాయ బృందం మురళినాయక్‌ను సన్మానించింది.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ చర్యలు భేష్

తంగళ్లపల్లి, సెప్టెంబరు 25: దశాబ్ద కాలంగా రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం గాడితప్పిందని, ప్రస్తుత ప్రభుత్వం గాడిన పెట్టే చర్యలు చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా పక్షాన స్వాగతిస్తున్నమని జిల్లా అధ్యక్షులు పాకాల శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలో బడు గు బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందాలంటే పర్యవేక్షణ చాలా కీలకమైందన్నారు. జిల్లా కోశాధికారి పర్కాల రవీందర్, జిల్లా కార్యదర్శి ఆడెపు శివకుమార్, ఎంఎస్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల బాధ్యులు నాగరాజు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ జయంతిని విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25 : చిట్యాల ఐలమ్మ 109వ జయంతిని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. బుధవారం పట్టణ కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలసిన నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25 : ఎస్సీ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతంను కాంగ్రెస్ సెల్ జిల్లా పట్టణ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్ నగరి ప్రీతంను శాలువ, పుష్పగుచ్ఛాలతో నాయకులు సన్మానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు రావాలని నగరి ప్రీతంను నాయకులు ఆహ్వానించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు నాగరాజు, కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 25: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు పరిధిలోని బాబాజీ కాలనీకి చెందిన ఇనుకొండ రజితసతీష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి రూ.28 వేల 500 మంజూరవడంతో ఆ చెక్కును బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, పట్టణ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సలేంద్రి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదాసు లక్ష్మణ్, శివరాత్రి కనకయ్య, సంగేం గౌతమ్, బోమ్మెన అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆటో డ్రైవర్ మృతి

- చందాలతో అంత్యక్రియలు

చందుర్తి సెప్టెంబరు 25: అనారోగ్యంతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందడంతో గ్రామస్థులు చందాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. చందుర్తి మండలం ఎనగల్‌లో బుధవారం చోటుచేసుకున్న సంఘటన వివరాలు.. గ్రామానికి చెందిన వాసం ప్రసాద్ (32) అనే ఆటో డ్రైవర్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రారమస్థులు చందాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రసాద్‌కు భార్య కీర్తన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

'ఇందిరా మహిళా శక్తి'తో ఆర్థిక ప్రగతి సాధించాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


ఓపెన్ జిమ్‌కు భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


లేడీస్ ఎంపోరియంను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది

వేములవాడ టౌన్, సెప్టెంబరు 25: ఇందిరా మహిళా శక్తి పథకంతో గ్రామీణ మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రుద్రవరంలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి భూమిపూజ, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా అంబేద్కర్ స్వయం స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డెయిరీ, పార్లర్, లేడీస్ ఎంపోరియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సహకాలు అందిస్తోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటీ మంది మహిళను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో ముందుకు పోతున్నారు. ప్రతి ఎటా రూ.20 వేల కోట్లు వెచ్చించి బ్యాంకు ద్వారా వారి జీవన ఉపాధిని పెంపొందించే కార్యక్రమాన్ని చేపడుతున్నారని, మహిళా సాధికారికత లక్ష్యంగా ముందుకు పోతున్నారని అన్నారు. గతంలో మహిళలను లక్షా అధికారులు చేయడం లక్ష్యంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీకి రుణాలు ఇచ్చారని, అనంతరం కిరణ్ కుమార్‌రెడ్డి వడ్డీలేని రుణాలను మంజూరు చేశారని గుర్తు చేశారు. మళ్లీ ప్రజా ప్రభుత్వంలో మహిళా అభివృద్ధి లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారుగా 9వేల 985 మహిళా సంఘాలలోని లక్షా 9 వేల మంది సభ్యులు ఉన్నారని, వారిలో ఉపాధి పరిశ్రమలు పెట్టుకోవడానికి ముందుకు వస్తున్నారని అన్నారు. జిల్లా పరిధిలోని రూ. 600 కోట్లతో బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నామన్నారు. 7 వేల 79 మంది మంది యూనిట్లకు ప్రస్తుతం 3 వేల 30 మందికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. మహిళల ఉపాధి కోసం 125 రకాల ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చడానికి కృషి చేస్తున్నారని, అందులో భాగంగా యువతకు ఉపయోగపడే ఓపెన్ జిమ్‌కు భూమి పూజ నిర్వహించామని పేర్కొన్నారు. ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. మహిళలు ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, నాయకులు గాలిపెల్లి స్వామి, ఊరడి రాంరెడ్డి, కత్తి కనుకయ్య, సింగిల్‌విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, వంకాయల భూమయ్య, తాడెం శ్రీనివాస్, ఎర్రం ఆగయ్య, ఎర్రం సత్తయ్య తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీల పాలకవర్గాలకు సన్మానం


ఎల్లారెడ్డిపేటలో సన్మానిస్తున్న చక్రధర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25 : సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, డైరెక్టర్ మహ్మద్ ఖాజామోయినుద్దీన్ ఎంపి కపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సిరిసిల్లలో కాంగ్రెస్ పట్టణ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో సన్మానించారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు అహమ్మద్‌ఖాన్, ఉపాధ్యక్షుడు మీర్జా మతిన్, ప్రధాన కార్యదర్శి కలీం, కార్యదర్శి షేక్ ఆజం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ పాలక వర్గం సభ్యులను బుధవారం కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌రెడ్డి సన్మానించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం భర్త గౌస్, వైస్ చైర్మన్ రాం రెడ్డి, డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు రాజునాయక్, అంజిరెడ్డి, రవి, రాజయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లెంకెల లక్ష్మణ్‌తో పాటు సభ్యులను స్థానిక సెస్ కార్యాలయంలో డైరెక్టర్ మాడుగుల మల్లేశం బుధవారం సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, బీజేపీ దిశా కమిటీ జిల్లా సభ్యుడు బట్టు పీర్యా, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: నూతనంగా నియామకమైన సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వేల్పుల స్వరూప తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్‌ను బుధవారం సిరిసిల్ల ప్యాక్స్ కార్యాలయంలో సిరిసిల్ల ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి సన్మానించారు. అనంతరం ప్యాక్స్ పాలకవర్గం సమావేశం నిర్వహించి దరఖాస్తు చేసుకున్న ముగ్గురు లబ్ధిదారులకు రూ.15 లక్షల రుణం మంజూరు చేసి చెక్కులను పంపిణీ చేశారు. డైరెక్టర్లు భైరి ప్రభాకర్, గడీల సురేష్, వెన్నమనేని శ్రీధర్‌రావు, బండి దేవేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బోయినపల్లి: నూతనంగా నియామకమైన బోయినపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్‌గా నిమ్మ వినోద్‌రెడ్డి, డైరెక్టర్లుగా అనుముల హరికృష్ణ, మహమ్మద్ యూసుఫ్, గంగిపల్లి లచ్చయ్య, బాలగోని వెంకటేష్, అద్దంకి రమేష్, గుడి రాజశేఖర్ రెడ్డి, నీరేటి ప్రదీప్ కుమార్, కల్లేపల్లి సతీష్, మెరుపుల మహేష్, రోమాల అజయ్, ఏనుగుల కనకయ్య, జక్కని సందీప్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో జయశీల, సింగిల్ విండో చైర్మన్ జోగినపల్లి వెంకట రామారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బోయినపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంత్యుత్సవాలకు ఆహ్వానం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్ పర్సన్, ఉత్సవ కమిటీ సభ్యులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25 : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతోత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మున్సిపల్ చైర్ పర్సన్, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్ జిందం కళాచక్రపాణి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో జయంత్యుత్సవ కమిటీ కార్యవర్గం సభ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆహ్వాన కరపత్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కమిటి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు జయంత్యుత్సవ బాపూజీ ఆశయా సాధన కోసం కృషి చేయాలన్నారు. గతేడాది మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల పట్టణంలో ఆచార్య జయంత్యుత్సవ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు సిరిసిల్ల పట్టణం విద్యానగర్ బైపాస్ కూడలిలో ఆచార్య జయంత్యుత్సవ బాపూజీ జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఎస్పీకి ఆహ్వాన పత్రాలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు, పద్మశాలి మహిళా విభాగం సిరిసిల్ల అధ్యక్షురాలు వనిత, యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి


సిరిసిల్లలో వేడుకలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు25: జనసంఘ్ వ్యవస్థపకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతిని బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని 37 వవార్డు వెంకంపేటలోని బూత్ నంబర్ 146లో పట్టణ ఉపాధ్యక్షుడు ఊరగోండ రాజు లక్ష్మీ అధ్వర్యంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, జిల్లా అధికార ప్రతినిధి ర్యం నవీన్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ మాసం భాస్కర్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు సుంకరి బాలకిషన్, పట్టణ ఉపాధ్యక్షులు చొప్పదండి అంజన్న, నాయకులు ఆనంద్ బాబు, శ్రీనివాస్, భాస్కర్, కోడం రవి, కోడం బాలకృష్ణ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గొట్టే రామచంద్రం ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డబ్బుల వివరాలు తెలపాలి

వీర్నపల్లి, సెప్టెంబరు 25: వీర్నపల్లి మండల రంగంపేట శివనీల గ్రామై క్య సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా సమకూరిన బోనస్, గ్రామంలోని 25 సంఘాల నుంచి ప్రతీనెల పొదుపు డబ్బుల వివరాలు తెలపాలని పలువురు మహిళా సంఘాల సభ్యుల డిమాండ్ చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా సీఏ, అధ్యక్ష కార్యదర్శిని అడిగితే తెలపడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలోని స్వశక్తి సంఘాలకు రుణాలు మంజూరు చేసి వారి నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరపాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీఎం నర్సయ్యను వివరణ కోరగా గ్రామైక్య సంఘం సమావేశంలో పాత లెక్కల విషయంలో పలుమార్లు గొడవలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సభ్యుల సమస్యను పరిష్కరించడానికి సీసీ రాదను సమావేశానికి పంపినా ఇరువురి మధ్య సమన్వయం సరిగా కుదరలేదన్నారు. మరో సమావేశానికి తానే స్వయంగా వెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

పదేళ్లు సహజ వనరుల దోపిడీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25: రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు సిరిసిల్ల నియోజకవర్గంలోని సహజ వనరులను దోచుకున్నారని, ముందు వారి వెన్ను చూసుకొని మాట్లాడాలని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నాయకులు వెద్య శివప్రసాద్, కత్తెర దేవదాస్‌తో కలిసి మాట్లాడారు. అధికారుల సమక్షంలో నియోజకవర్గంలోని రేషన్ దుకాణాల ఖాళీల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా చేశారన్నారు. రాత పరీక్ష ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు.ఏమో జరుగుతోందని భూతద్దంలో చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపంచారు. నియోజకవర్గంలో సహజ వనరులను దోపిడీకి గురిచేసిన వ్యక్తికి ప్రెస్ మీట్‌లో కేకే మహేందర్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సిరిసిల్ల ప్రజలకు ఎవరి ముఖాలు ఏంటో.. ఏ స్థాయి నుంచి ఏ స్థాయికి వచ్చారో తెలుసన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజా, పట్టణ కార్యదర్శి కాసర్ల రాజు, ఉపాధ్యక్షుడు వెంకటేశం, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ప్రమోద్, మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ ఇరుకుల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రద్దుపై అబద్ధపు ప్రచారం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, సెప్టెంబరు 25 : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్‌తో కలిసి బుధవారం వేములవాడలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ అమెరికాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవ విరుద్ధ మాటలు మాట్లాడిన రాహుల్ గాంధీ వెంటనే ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమెరికాలో రాహుల్ గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వెనకాల అంతరార్థం ఏమిటి అనేది ప్రజలు తెలుసుకోవాల్సి ఉందన్నారు. అంతర్జాతీయ వేదికపై భారత్‌ను విమర్శించడం అంటే చైనాకు తొత్తుగా వ్యవహరిస్తున్నట్లేనని అర్థం చేసుకోవాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి బీజేపీ కట్టుబడి పని చేస్తున్నదని, కేంద్రంలోని సంక్షేమ మంత్రిత్వ శాఖ పేరును ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి హయాంలో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖగా మార్చారని గుర్తు చేశారు. దేశంలో అత్యధిక ఎస్సీ ఎంపీలను అందించిన పార్టీ బీజేపీ అని, దేశాన్ని, దళితులను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి, దేశ ప్రజలకు రాహుల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చందుర్తి మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్, పెరుక గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : భారతీయ జనత పార్టీ ద్వారానే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ మల్లారపు సంతోష్‌రెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాళ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా సమర్పణ దివస్‌లో భాగంగా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఒకే రోజు 300 మందికి తగ్గకుండా చూడాలని కోరారు. గడప గడపకు బీజేపీ చేసిన కార్యమాలు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, ప్యాక్స్ చైర్మన్ యెల్ల గిరిధర్‌రెడ్డి, మీస శంకర్, దీటి సత్తయ్య, ఒరగంటి సత్యం, పప్పుల శ్రీకాంత్, మెంగని మహేందర్, ఏదునూరి గోపి, మీస శ్రీను, బాలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


సమావేశంలో తాజా మాజీ సర్పంచులు

సిరిసిల్ల టౌన్/ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 25 : తాజా మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ కోరారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో తాజా మాజీ సర్పంచుల జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ నాడు అధికారంలో ఉన్న సమయంలో అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు నేటికీ రాకపోవడంతో అప్పులకు వడ్డీలు కట్టలేక కొందరు సర్పంచులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. అక్టోబరు 17 వరకు ప్రభుత్వం స్పందించాలని, బిల్లులను విడదల చేయకపోతే అక్టోబరు 18న జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తామని అన్నారు. పెండింగ్ బిల్లులు విడదల చేసేంతవరకు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై సభ్యులతో చర్చించారు. ఈ సమావేశంలో తాజా మాజీ సర్పంచుల జిల్లా జేఏసీ ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కోశాధికారి వెన్నెమనేని వంశీకృష్ణ, కార్యదర్శి చల్ల నారాయణ, సంయుక్త కార్యదర్శి కోలా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను విస్మరించిన సీఎం


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 25: మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారని, ఇప్పటికైనా స్పందించి అతి తక్కువ జీతంతో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు వేతనాలు పెంచి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోడం రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుర్రం అశోక్ మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులకు, పాలకవర్గాలు కార్మికులతో పని చేయించుకోవడంపై చూపిస్తున్న శ్రద్ధ వారి సమస్యల పరిష్కరించడంపై ఎందుకు చూపించడం లేదని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. స్థానికంగా ఉన్నటువంటి పీఆర్సీ, పీఎఫ్, ఈఎస్ఐ తదితర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం అమలు చేయాలని, అదేవిధంగా జిల్లాలోని సిరిసిల్ల - వేములవాడ మున్సిపాలిటీలలో స్థానిక సమస్యలపై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకోవాలన్నారు. కలెక్టర్ సమక్షంలో మున్సిపల్ అధికారులు, యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరపాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో అక్టోబరు 8వ తేదీ చలో హైదరాబాద్ మున్సిపల్ డైరెక్టర్ ఆఫీస్ ముట్టడి చేపడతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్దాస్ గణేష్, నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కాసారపు శంకర్, దొబ్బల లచ్చయ్య, బత్తుల దేవరాజు, రెడ్డి మల్ల రాజయ్య, వేల్పుల బాలయ్య, ఉమ, శంకరవ్వ, లక్ష్మీ, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు

వేములవాడ: బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్నందున తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వేములవాడ మున్సిపల్ కార్మికులు బుధవారం స్థానిక మూలవాగు వంతెన వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం చెల్లించాల్సిన వేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతీ కార్మికుడికి కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా ఆరోగ్య కార్డులు, అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలన్నారు. ఒకరోజు వేతనంతో కూడిన వారాంతపు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు అజ్జు, విజయ్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు మరాటి రాజయ్య, ప్రధాన కార్యదర్శి పందుల మల్లేశం, కార్మికులు తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాటం


పొదుపు డబ్బులను అందజేస్తున్న సంధ్య

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 25 : దివ్యాంగుల హక్కుల సాధన కోసం సంఘం ఆధ్వర్యంలో పోరాడుతామని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆకుల సంధ్య అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం సత్య సాయి సేవా మందిరం ప్రాంగణంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసు కున్న పొదుపు డబ్బులు రూ.10వేలను ఊరకొండ లతకు ఒక్క రూపాయి వడ్డీకి ఇచ్చారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ ఎవరి మీద ఆధార పడకుండా స్వయంకృషితో ముందుకు వెళ్లాలని సంపాదించుకుంటున్న దానిలో నుంచి సంఘం ఆధ్వర్యంలో పొదుపు చేస్తూ ఆ డబ్బులను అతి తక్కువ వడ్డీకి ఇచ్చినట్లు చెప్పారు. పొదుపుతో అభివృద్ధి సాధ్యమని భావించామన్నారు. ఒక వైపు దివ్యాంగుల హక్కుల సాధన కోసం పోరాడుతూనే అభివృద్ధి కోసం పొదుపు చేసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి భోగ రాజయ్య, ఉపాధ్యక్షుడ జవాజీ అమర్నాథ్, సహాయ కార్యదర్శి అంబటి శ్రీనివాస్, కోశాధికారి ఊరకొండ లత, గౌరవ అధ్యక్షులు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు